క్లుప్తంగా

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

భోగాపురం: ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ ఏఎన్ఎం పద్మావతి తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ రామకృష్ణనాయుడు అధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిబిరాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొమ్మూరు సుభాషణరావు, సుందర హరీష్, పడాల భానుప్రకాష్, అడపా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భోగాపురం: మండలంలో కొత్తగా పొలాలు కొనుగోలు చేసి పట్టాదారు పాస్‌బుక్‌లు కలిగిన రైతులు వైఎస్సార్ రైతుభరోసాకి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి. హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాస్‌బుక్‌లతో పాటు పూర్తి వివరాలు స్థానిక వీఏఏకు అందజేయాలని పేర్కొన్నారు.

నేడు తపాలా శాఖ పథకాలపై అవగాహన

నెల్లిమర్ల రూరల్: మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో జనంలోకి మనం పేరిట గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నెల్లిమర్ల, రామతీర్థం సబ్ పోస్ట్‌మాస్టర్లు జి. ఎర్రయ్య, పి. వెంకటరమణ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ, తపాలాశాఖ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. సాయంత్రం నాలుగు గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, పోస్టల్ సిబ్బంది, ప్రజలు హాజరు కావాలని కోరారు.

లెక్చరర్‌కు సత్కారం

నెల్లిమర్ల: రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన స్థానిక సీకేఎం గవర్నమెంట్ జూనియర్ కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ అలజంగి చంద్రశేఖర్‌రావును ఆ కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, సిబ్బంది బుధవారం సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీవీఈఓ ఆర్. సురేష్‌కుమార్, ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చంద్రశేఖర్ ఎంతోమంది పేద విద్యార్థులు చదువుకు ఎంతో సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎ. కృష్ణారావు, ఎ. రవిమోహన్‌ప్రసాద్, సీతం కాలేజీ ఎం.డి ఎం శశిభూషణరావు, రామానంద పట్నాయక్, పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాశివుడికి ప్రత్యేక పూజలు

విజయనగరం టౌన్: మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక గూడ్స్‌షెడ్ వద్ద నున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైన మహాశివునికి ఆలయ అర్చకుడు సోమశేఖరాచార్యులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేపట్టారు.

ముడిదాంలో పౌష్టికాహార వారోత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రసన్న

విజయనగరం రూరల్: మండల పరిధిలోని కోరుకొండ సెక్టార్ పరిధి ముడిదాం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ప్రసన్న మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అలాగే బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని సూచించారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటైనర్ వాహనంలో మంటలు



క్యాబిన్‌లో చెలరేగుతున్న మంటలు

భోగాపురం: కోల్‌కతా నుంచి చెన్నై వెళ్తున్న కంటైనర్ వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్యాబిన్ దగ్ధమైన సంఘటన భోగాపురం జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వాహన డ్రైవర్ తెలియజేసిన వివరాల ప్రకారం... కోల్‌కతా నుంచి ముడిసరుకులను లోడు చేసుకుని చెన్నై వెళ్తుండగా భోగాపురం జాతీయ రహదారి వద్దకు చేరుకునేసరికి ఒక్కసారిగా ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో కంటైనర్ డ్రైవర్ ఒక్కసారిగా కిందకుదిగి పరుగులెత్తాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



విజయనగరం రూరల్: లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తున్నారని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ద్వారపూడిలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కుల, మత భేదాల్లేకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన అవ్వా,తాతలకు పింఛన్లు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న దేశ చరిత్రలోనే ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో ద్వారపూడి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పూసపాటిరేగ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని రెల్లివలసలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ గొర్లె వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

కొప్పెర్లలో..

మండలంలోని కొప్పెర్లలో సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు, వైస్ సర్పంచ్ లంకలపల్లి రాజారావు చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. చౌడువాడలో మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యం

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడలో 13 మంది కొత్త లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పింఛన్లు పొందాలంటే జన్మభూమి కమిటీలకు లంచం చెల్లించాల్సి ఉండేదని.. నేడు అటువంటి పరిస్థితి లేకుండా నేరుగా వలంటీర్లే అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి మొయిద అక్కోజీరావు, కార్యదర్శి యర్రా రమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: కొత్త పింఛన్ల లబ్ధిదారులతో సన్యాసినాయుడు, తదితరులు

ప్రజలు మెచ్చిన ముఖ్యమంత్రి జగనన్న



ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు తమ్మన్నశెట్టి

విజయనగరం: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్రంలో స్వర్ణయుగ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల మెచ్చిన నాయకుడని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమన్నశెట్టి అన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో కంటోన్మెంట్ ప్రాంతం కాంబోవీధి నుంచి బుధవారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగున్నరేళ్ల కాలంలో సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇదే సమయంలో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. అందులో అర్హులున్నవారిని గుర్తించి పథకాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కోలగట్ల తమ్మన్నశెట్టి మాట్లాడుతూ, ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ప్రతిఒక్క వాగ్దానాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందన్నారు. సచివాలయ వ్యవస్థ వల్ల మధ్యవర్తులు, దళారులు లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో నగరం అన్నిరంగాల్లోనూ దూసుకుపోతోందన్నారు. కార్పొరేటర్ పట్నాన పైడిరాజు మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ దూబే, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులు సోషల్ మీడియా, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక బాలజీనగర్‌లో గల శ్రీనివాస్ జూనియర్ కళాశాలలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం కల్పించే దిశగా అధికారులు పని చేయాలన్నారు. పాఠశాలలు, వివిధ హస్టళ్లకు సమీపంలో మద్యం దుకాణాలు, బార్లు లేకుండా ఎక్సైజ్‌శాఖ, పోలీస్‌శాఖ, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, చైల్డ్‌లైన్ ప్రతినిధులు సంధ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న నిర్వాహకులు

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాం జగనన్న లే అవుట్‌లో స్పార్క్ సొసైటీ, లిఫ్టింగ్ హ్యాండ్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి సర్పంచ్ కునుకు వెంకటరావు (నాగరాజు) హాజరై కాలనీ వాసులకు మట్టి విగ్రహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, స్పార్క్ సొసైటీ ప్రతినిధి పద్మనాభం, లిఫ్టింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు కంది గౌరీశంకర్, అన్నదాన ట్రస్ట్ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి, కాలనీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మందులు మానకుండా చర్యలు



మాట్లాడుతున్న సూర్య నారాయణ

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు మందులు మానకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఏఆర్‌టీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల భాగస్వాములకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ఏఆర్‌టీ మందులతో పాటు భాగస్వాములకు హెచ్ఐవీ పరీక్షలు కేంద్రంలోనే చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలాజీ, సాక్షి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు అభినందన

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో మొట్టమొదటి సారిగా గాయత్రి ఆస్పత్రిలో కాంక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స నిర్వహించడం అభినందనీయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రూ. 8 లక్షల విలువ చేసే ఆపరేషన్‌లను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేసిన వైద్యులు టి.కృష్ణకిషోర్, జీబీ వెంకట్, మనోహర్, ధర్మానాయుడులను బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, పుట్టుకతో వచ్చే చెవిటి, మూగ పిల్లలకు, సంప్రదాయ వినికిడి మిషన్‌తో ప్రయోజనం పొందలేని పిల్లలకు ఈ కాంక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సతో వినికిడితో పాటు మాట్లాడే అవకాశం కలుగుతుందన్నారు. సంవత్సరంలోపు పిల్లలు ఇద్దరికి కాంక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు చేపట్టినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు (ఎలక్ట్) డాక్టర్ జయచంద్రనాయుడు, డాక్టర్ పావని, డాక్టర్ మహేంద్రగిరి, తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

వ్యక్తి అదృశ్యం

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన పాండ్రంగి ఆదికృష్ణ (65) అనే వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీ అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆదికృష్ణ ఇంతవరకు ఇంటికి చేరుకోకపోవడంతో అతని కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ ఎం. రాధిక అవగాహన కల్పించారు. ఆస్పత్రి ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైద్యశిబిరాల నిర్వహణ, రోగులకు అందించాల్సిన వైద్యసేవలు, తదితర అంశాలపై వివరించారు. అనంతరం పీహెచ్‌సీలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వేదమణి, ఆర్‌వీ రమణ, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి..

నెల్లిమర్ల: నగర పంచాయతీలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి, క్యాంపు ఆవశ్యకత, ఆరోగ్యశ్రీ కింద ఆరోగ్యసేవలను ఉచితంగా ఎలా పొందవచ్చో వివరించడంతో పాటు స్మార్ట్‌ఫోన్‌లలో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలన్నారు. అలాగే సర్వేలో వ్యాధి, పుట్టుకతో వచ్చే లోపాలు, వైకల్యాలను గుర్తించి అటువంటి వారందరూ శిబిరాలకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. అవగాహన కార్యక్రమాలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో పట్టణ ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ సమీరా, నగర పంచాయతీ మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ డి. ఉమాభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

డెంకాడ: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి భాస్కరరావు అన్నారు. మండలంలోని ముగినాపల్లిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎన్‌సీడీ, ఆర్‌సీహెచ్ మొబైల్ యాప్‌లో నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవానీ, ఎంపీహెచ్ఈఓ సత్తిరాజు, ఎంపీహెచ్ఎస్ గురుభక్తులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్, తదితరులు పాల్గొన్నారు.



సేవలపై ఆరా తీస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు

అనాలోచిత నిర్ణయాలు తగవు

నెల్లిమర్ల రూరల్: క్షణికావేశంలో అనాలోచిత నిర్ణయాలు తీసుకుని బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరాం, మానసిక వైద్య నిపుణురాలు తేజస్విని సూచించారు. మండలంలోని సతివాడ జేటీఎస్ఎమ్ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్య నివారణ దినం సందర్భంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మానవ జీవితంలో కష్టాలు, బాధలు సహజమేనని.. దేనినైనా పాజిటివ్‌గా తీసుకొని ముందుకు సాగాలన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎన్నో అనర్థాలు కలిగిస్తాయని.. కుటుంబం చిన్నాభిన్నమవుతుందని చెప్పారు. ఇంట్లో సమస్యలు, పరీక్షల్లో ఒత్తిడి, ఒంటరిగా ఆలోచించడం వంటి కారణాలతో ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, సమస్యలు ఉంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. అలాగే టోల్ ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చసి సహాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ, మానసిక ఆరోగ్య సిబ్బంది రాజు, సంతోష్, ఏఎన్ఎం శ్రీదేవి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మానసిక, వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆకట్టుకున్న ఇన్నర్‌వీల్ క్లబ్ మహిళా ఉత్సవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షురాలు కాపుగంటి సుధ (ఇన్‌సెట్లో) ప్రదర్శనలో ఉంచిన చేతితో తయారు చేసిన ఉత్పత్తులు

విజయనగరం: ఇన్నర్‌వీల్ క్లబ్ ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించమని క్లబ్ అధ్యక్షురాలు కాపుగంటి సుధ అన్నారు. పట్టణంలోని రింగ్‌రోడ్డు సుజాత కన్వెన్షన్ హాల్‌లో మహిళా ఉత్సవ్ -2023ను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళ ఉత్సవ్‌లో మహిళలచే రూపొందించబడిన వివిధ రకాల చేతివృత్తుల ఉత్పత్తులను ప్రదర్శించామని, వీటి విక్రయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని క్లబ్ సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చిస్తామన్నారు. తమ కార్యవర్గం ఆధ్వర్యంలో వికలాంగులకు వీల్‌చైర్లు, పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా ఉత్సవ్‌కు మూడు జిల్లాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శి జి. సంధ్యారమ, ప్రాజెక్టు చైర్‌పర్సన్ జి.శిరీష, కె.విజయ, తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అగ్రగామిగా నిలపాలి

- లీడ్ ఇండియా వ్యవస్థాపకుడు ఎన్‌బీ సుదర్శన ఆచార్య



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

విజయనగరం రూరల్: దేశాన్ని అగ్రగామిగా నిలపడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని లీడ్ ఇండియా వ్యవస్థాపకుడు ఎన్‌బీ సుదర్శన ఆచార్య తెలిపారు. మండలంలోని సుంకరిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్, లీడ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న లీడ్ ఇండియా మిషన్ 2047 శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎన్‌బీ సుదర్శన ఆచార్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, మానవతా విలువలు, జీవిత లక్ష్యం, శారీరక, మానసిక, సామాజిక, అభివృద్ధి అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా నోడల్ అధికారి కాకినాడ సుబ్రహ్మణ్యం, మాస్టర్ శిక్షకులు పి.శ్రీనివాస్, డాక్టర్ సలావుద్దీన్, రవిశర్మ, ధనుంజయ్, హేమంత్, వర్షిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

- ఎస్పీ దీపిక



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: విజయనగరం పట్టణంలో నూతనంగా నిర్మించిన వైద్య కళాశాల భవన ప్రారంభోత్సవానికి ఈనెల 15న రానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భద్రతకు సుమారు 900 మందితో బందోబస్తు ఏర్పాటు చేయనున్నామని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. ఈ మేరకు చేపట్టిన ఏర్పాట్లను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బందోబస్తును వివిధ కేటగిరీలుగా విభజించి, భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని చెప్పారు. హెలీప్యాడ్, పార్కింగ్, కాన్వాయ్, వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ, శిలాఫలకం, రూట్ బందోబస్తు , ట్రాఫిక్ రెగ్యులేషన్, పార్కింగ్ , వైద్య కళాశాల భవనం వద్ద విధులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందిని నియమించామని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనే ముఖ్య వ్యక్తుల వాహనాలు, కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసే వారి వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తు నిమిత్తం ఒక అదనపు ఎస్పీ, ఆరుగురు డీఎస్పీలతో సుమారు 900 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, దిశా డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, టూటౌన్ సీఐ ఎన్‌హెచ్‌వీ ఆనంద్, సీసీఎస్ డీఎస్పీ సీఐ ఎం.బుచ్చిరాజు, డీపీఆర్‌బీ సీఐ జె.మురళి , ఇతర పోలీసు అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

'పది శాతమైనా ఖర్చు చేయడం లేదు'



మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్

విజయనగరం టౌన్: ఫార్మా కంపెనీ యజమానులు తమకొచ్చే లాభాల్లో కనీసం పది శాతమైన సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడం లేదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో ఉన్న ఫార్మా కంపెనీలు నిరుపేదలకు కనీస సౌకర్యాలు కల్పించడంలేదన్నారు. కనీస నియమ నిబంధనలు కూడా పాటించడం లేదని, ఉద్యోగాలు కల్పించడం లేదని ఆరోపించారు. సెప్టెంబరు 24న చలో విశాఖకు పిలుపు ఇస్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.